నమస్తే తెలంగాణ
# జిందగీ



Valentine's Day








ప్రేమ... ఇష్క్.. లవ్.. కాదల్...
పురాణ కాలం నుంచీ ఉన్నవే!
ఈశ్వరుడి ప్రేమ కోసం పార్వతి తపస్సు చేసింది. రాధ ప్రేమకై కృష్ణుడు పరితపించాడు. చరిత్రకొస్తే.. లేటు వయసులోనూ చిగురించిన ఎన్నో ఘాటు ప్రేమలు కనిపిస్తాయి. ఈ ప్రేమలన్నిటికన్నా, వెండితెరపై వండి వడ్డించిన ప్రేమకథలే... సమాజంపై తీవ్ర ప్రభావం చూపించాయన్నది కాదనలేని సత్యం. ఆ చిత్రాల్లో కవిపండితులు పండించిన గీతాలు.. కరకు గుండెకూ ప్రేమ చురుకు తగిలించాయి. సాదాసీదా సినిమాల్లో సైతం 'ప్యార్ హువా.. ఇక్‌రార్ హువా..' అని నినదించిన సినీ కవులు, ఫక్తు లవ్‌స్టోరీస్‌లో కామ్‌గా ఉంటారా? కదనకుతూహల రాగమంత వేగంగా కాదల్ గీతికలను అందించారు. ఆనాటి 'బాలరాజు' నుంచి నిన్నమొన్నొచ్చిన 'గుంటూరు కారం' వరకు ఎన్నో సినిమా పాటలు.. వలపు పాఠాలై ప్రేమ పావురాలకు రెక్కలు తొడిగాయి. రానున్న ప్రేమికుల రోజు సందర్భంగా లవ్ గీతోపదేశాన్ని ఆలకిద్దాం...

# ప్రేమ గీతోపదేశం

'ప్రేమ రా! కృష్ణా! ఎంతపనైనా చేయిస్తుంది' అని వివాహ భోజనంబు సినిమాలో నూతన్‌ప్రసాద్ పాత్ర తన కొడుకుతో చెప్పే డైలాగ్ ఇది. అవును ప్రేమ ఎంత పనైనా చేయిస్తుంది. 'నిజం చెప్పమంటారా.. అబద్ధం చెప్పమంటారా' అని చేతులు కట్టుకొని వినయంగా పలికిన తోట రాముడు 'ప్రేమ కోసమే' కదా.. నేపాల మాంత్రికుడి వలలో పడింది. ప్రేమ కిక్కు ఎక్కినవారికి చిక్కులకేం తక్కువుండదు. అయితే, వాటన్నిటినీ అధిగమించే శక్తియుక్తులను సినిమా పాటలే అందించాయి, అందిస్తున్నాయి. ప్రేమ చిగురించేలా.. చిగురించిన ప్రేమను వ్యక్తపరిచేలా.. వ్యక్తీకరించిన ప్రేమను నిలుపుకొనేలా.. నిలిచిన ప్రేమను గెలిచేలా.. ఇలా ప్రేమ పురాణంలోని ప్రతి పర్వంలోనూ సినిమా పాట కొత్త బాట పరుస్తుంది. దైనందిన జీవితంలో సినిమాల్లోలా ప్రేమికులు యుగళ గీతాలు పాడుకోరు! కానీ, ప్రేమగీతాలను మాత్రం జంటగా ఆస్వాదిస్తారు. కొంటెగా కంటి సైగలు చేసుకుంటూ వింటారు. సందర్భోచితంగా లవ్‌సాంగ్స్‌ను డైలర్ టోన్స్‌గా పెట్టుకునే వాళ్లు కొందరైతే, వాట్సప్ స్టేటస్‌లో తన ప్రేమను వెల్లడించేవారు ఇంకొందరు.

నచ్చిన కుర్రాడు కంటపడగానే కాస్త నోస్టాలజీ టేస్ట్ ఉన్న చిన్నదానికి 'తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు..' అని మధ్యమావతి రాగంలో మదిలో ఏవేవో కదలాడుతాయి. కంటికి నజర్‌గా కనిపించింది తన జానే జిగర్ అని నమ్మిన వాడు 'మాటే మంత్రమూ.. మనసే బంధమూ..' అని ఊహల్లోకి వెళ్లిపోవడం ఖాయం. ఈ తరం పిల్లగాడైతే.. 'సామజవరగమనా.. నిను చూసి ఆగగలనా..' అని లోలోపల పాటందుకొని 'చూపే సింగారమాయనే.. శ్రీవల్లి' అని బయటకు అనేస్తాడు. ప్రేమ పాటల్లో మత్తు అలాంటిది. పింగళి వారి పాళి నుంచి ఎన్ని అను'రాగాలు' పురుడు పోసుకోలేదు! ఆయనగారన్న 'అవునంటే కాదనిలే.. కాదంటే అవుననిలే.. ఆడువారి మాటలకూ అర్థాలే వేరులే' పాట ప్రేమ నిర్వచనాన్నే మార్చేసింది. ఈ ఒక్క ముక్క పట్టుకొని లెక్కకు అందనంత మంది లవ్‌లో సెటిలయ్యారు. 'విసిగి నసిగి కసిరినచో..' విషయం అసలు ఇష్టమే అని సూత్రీకరించుకుని పట్టువదలక ప్రయత్నించి విజేతలైన ప్రేమికులు ఎందరో! అమ్మాయి 'ఐ హేట్ యూ..' అన్నా.. 'హేట్ అంటే లవ్వనిలే' అని ఈ తరమూ తబ్బిబ్బవుతున్నది. జ్ఞాన తెలుగుకు జాణతనం నేర్పిన దేవులపల్లి గీతం 'కుశలమా.. నీకు కుశలమేనా..' ఆ తరం ప్రేమికుల పలకరింపును పులకరింపుగా మార్చేసింది. దాశరథి విరచిత 'ఏ దివిలో విరిసిన పారిజాతమో.. ఏ కవిలో మెదిలిన ప్రేమ గీతమో..' పాట ఆనాటికే కాదు... ఈనాటికీ, మరేనాటికీ ప్రేమి'కుల' దైవమే!

'చుక్కలాంటి అమ్మాయి.. చక్కనైన అబ్బాయి...' ఇద్దరు ఒద్దికయ్యారంటే వాళ్లు కచ్చితంగా మన'సు కవి' ఆత్రేయను తమ ప్రేమకు ఆచార్యుడిగా భావించే ఉంటారు. 'నువ్వేనా సంపంగి పువ్వున నువ్వేనా.. జాబిలి నవ్వున నువ్వేనా.. గోదారి పొంగున నువ్వేనా..' అని ఆత్రేయ తోటలో పూసిన పూతరేకు వంటి పాట! దీన్ని విన్న ప్రేమపక్షులు 'పదహారేళ్లకూ నీలో.. నాలో.. ఆ ప్రాయం చేసే చిలిపి పనులకు.. కోటి దండాలు' పెట్టకుండా ఎలా ఉండగలరు. 'చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చెలికాడే సరసన ఉంటే..' ఎలా ఉంటుందో అప్పటివరకూ ఎవరికీ తెలియని భావన. 'చెప్పలేని ఆ హాయీ.. ఎంతో వెచ్చగ ఉంటుందోయీ..' అని ఆత్రేయ ముక్తాయింపు ఇచ్చిన తీరు ఆయన పాటలోనే చెప్పాలంటే 'ఈ నాడే ఏదో అయ్యింది.. ఏనాడూ నాలో కలగనిది...' అనుకోవాల్సిందే!!



ప్రేమ జంటలను పూర్తిస్థాయిలో వశపరుచుకున్న గీత రచయిత వేటూరే! పాటల పల్లకిలో ఆయన ప్రయోగించిన అలంకారాలన్నీ ప్రేమికుల పాలిట వరాలయ్యాయి. ఓ పాటలో 'సిరిమల్లె పువ్వా.. సిరిమల్లె పువ్వా..' అని 'పదహారేళ్ల వయసు'న్న చిన్నారి చిలకమ్మ కోరుకునే వాడి వైనాన్ని వర్ణించాడు. మరో పాటలో 'నీ హృదయం తపన తెలిసి నా హృదయం కనులు తడిసే వేళ...' అని ఉదాత్తమైన ప్రేమను చాటాడు. అంతలోనే 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను.. ' అని మోటు ప్రేమకు పురిగొలిపాడు. 'చిన్న చిన్న హద్దు మీర వచ్చునోయ్..' అన్న పంక్తి విన్న సఖీసఖులు వెనువెంటనే పద్ధతిగా ముద్దులకు సిద్ధపడితే తప్పేంటన్న బుద్ధి పుట్టకమానదు. వేటూరి ఒక్కోపాట ఒక్కో ప్రేమ పాఠం చెబుతుంది. సినిమాల్లో కురిసిన సిరివెన్నెల.. సీతారామశాస్త్రి. అశ్లీలానికి తావివ్వకుండానే ప్రేమికుల చేత 'బలపం పట్టి భామ ఒళ్లో అ ఆ ఇ ఈ నేర్చుకుంటా..' అనిపించారు. 'కృష్ణా నిన్ను చేరింది.. అష్టాక్షరిగా మారింది.. నివాళిగా నా మది నివేదించు సమయమిది..' అని అచ్చమైన ప్రేమ విన్నపం ఎంత స్వచ్ఛంగా ఉంటుందో వినిపించారు.


రొమాంటిక్ సాంగ్స్ అన్నీ ప్రేమ గీతాలు కాకపోవచ్చు. కానీ, ప్రేమ పాటలన్నీ శృంగార రస గుళికలే! ఆ పాటల్ని ఎవరు పాడినా అవి బ్యూటిఫుల్‌గానే ఉంటాయి. 'హలో గురూ! ప్రేమ కోసమే రా జీవితం..' పాటలో ఎస్పీబీ పలికించిన డైనమిక్స్.. ప్రేయసికి ప్రపోజ్ చేసే ప్రేమికుడికి కొత్త శక్తిని ఇవ్వకుండా ఉంటాయా! సిద్ శ్రీరాం కీచు గొంతుకలోంచి పుట్టిన 'ఇంకేం ఇంకేం ఇంకేం కావాలే..' పాటను ప్రేమలో పడ్డవారికి ఎన్నిసార్లు విన్నా ఏదో చాల్లేదనిపిస్తుంది. అదంతా ప్రేమ పాట గొప్పదనమే! ప్రేమ గీతోపదేశాన్ని ఆస్వాదించండి. ఇష్క్ తోటలో పుట్టిన మొహబ్బత్ పాటలను అనుసరించండి. 'ప్రేమించే ప్రేమవా..' అంటూ 'ఊరించే ఊహ..'కు ఊసులు వ్యక్తపరచండి. ప్రేమికుల రోజున జంటగా పాటల పల్లకీలో ఊరేగండి.

ఈ పాటల పాచిక పారకపోతే, అందం అందకుండా పోయినా, బంధం బలపడకముందే వీగిపోయినా.. గాబరా పడాల్సిన పనిలేదు. ప్రేమ విఫలమైనా... ఆ విరహాన్ని అధిగమించే అద్భుతమైన పాటలు సినీతోటలో ఎన్నో ఉన్నాయ్! 'ప్రేమలేదని... ప్రేమించరాదని.. సాక్ష్యమే నీవనీ...' అని నిన్ను నువ్వు చాటుకోవచ్చు. సముద్రాల వారన్న 'బాధే సౌఖ్యమనే భావన రానీవోయి.. ఆ ఎరుకే నిశ్చలానంద మోయ్..' పాట గొణుక్కుంటూ బ్రహ్మానందం పొందొచ్చు. ఎందుకంటే... మన లవ్‌డాక్టర్ శంకర్‌దాదా సెలవిచ్చినట్టు... ఈ వాలెంటైన్స్ డే నాడు 'మీ ఏరియాలోకి ఐశ్వర్య రావొచ్చు.....', అమ్మా ప్రేమకుమారీ మీ వాడ కట్టులోకి చింపిరి జుట్టున్న గ్రీకువీరుడు నీ రాకుమారుడై రావొచ్చు. అందాకా పాటలు ఆలకిస్తూ పండుగ చేసుకోవడమే!!

...కణ్వస

## విఫల ప్రేమిక.. మధుబాల!

బాలీవుడ్ నటి మధుబాల 1933 ఫిబ్రవరి 14న జన్మించింది. ప్రేమికుల రోజు పుట్టిన ఆమె 'మొఘల్ ఎ ఆజమ్' సినిమాలో అనార్కలి పాత్రలో విఫల ప్రేమికురాలిగా నటించింది. రియల్‌లైఫ్‌లోనూ అలాగే మిగిలిపోయింది. 'ప్యార్ కియాతో డర్నా క్యా!' పాటతో ప్రేమికులు తెగించాలని ఉపదేశించిన మధుబాల.. సలీమ్ పాత్ర ధరించిన దిలీప్ కుమార్‌ను ఇష్టపడింది. కానీ, అతని ప్రేమను పొందలేకపోయింది. సినిమాలో సలీమ్, అనార్కలీ ప్రేమకు అక్బర్ అడ్డుపడ్డాడు. నిజ జీవితంలో వీరిద్దరి ప్రేమకు మధుబాల తండ్రి అడ్డుగా నిలిచాడు. చిన్నప్పటి నుంచి గుండె సమస్య ఉన్న మధుబాల తనకు దిలీప్ దూరం కావడం తట్టుకోలేకపోయింది. 36 ఏండ్లకే 1969 ఫిబ్రవరి 23న కన్నుమూసింది.



## చేతిలోన చెయ్యేసి చెప్పేయవా..!

వాలెంటైన్ వీక్‌లో రోజుకో ప్రత్యేకం. రోజ్ డే, ప్రపోజ్ డే ఇలా ఎన్ని ఉన్నా... ప్రేమజంటకు కావాల్సింది నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయనని మాటిచ్చే ప్రామిస్ డే నేడు. ఈ రోజు చెలికాడు చేసే వాగ్దానం.. ఆ మర్నాటి హగ్ డే సందర్భంగా హత్తుకునే కౌగిలి కన్నా వెచ్చగా ఉంటుంది. ఆ మరుసటి కిస్ డే నాడు ఇచ్చి పుచ్చుకునే ముద్దు కన్నా తియ్యగా ఉంటుంది. ఎందుకంటే మొగ్గ తొడిగిన ప్రేమాయణం పరిణయంగా పరిణమించడం.. ఆ జంట చేసుకునే ప్రమాణంపైనే ఆధారపడి ఉంటుంది.

పెండ్లి దగ్గర కట్నకానుకలు కీలక పాత్ర పోషిస్తాయి కానీ, ప్రేమ దగ్గర మనసుదే ఆధిపత్యం. ఆ మనసులో మెదిలే భావాలను ఎంత అందంగా పంచుకుంటే ప్రేమ బంధం అంత బలపడుతుంది. తోడుగా ఎవరూ రాకున్నా.. జంటగా మీరుంటే చాలన్న నమ్మకం కలగాలి. కవితలే పంపుతారో, పొగడ్తల్లో ముంచెత్తుతారో, కానుకలే సమర్పించుకుంటారో.. మీ ఇష్టం! ఏం చేసినా అది మీ ఆధిపత్యాన్ని ప్రదర్శించేదై ఉండకూడదు. తన మీద మీకున్న అభిమానానికి తార్కాణంగా కనిపించాలి.

ఇద్దరూ కలుసుకున్నప్పుడు కాలం మంచులా కరిగిపోవాలి. అంతే కానీ గంటల ముల్లులా భారంగా సాగొద్దు. అందుకే అప్పుడప్పుడూ రొటీన్ భేటీలకు కామా పెట్టి లాంగ్ డ్రైవ్‌కు ప్లాన్ చేసుకోండి. ఆ ప్రయాణంలో మీ తోడులో మిమ్మల్ని ఆకట్టుకునే కోణం ఏదైనా ఆవిష్కృతం కావొచ్చు. అది వారిపై మరింత నమ్మకాన్ని కలిగించొచ్చు.



ప్రేమకు పుట్టడం తప్ప గిట్టడం తెలియదు. కానీ, ఈ టెక్నాలజీ యుగంలో ప్రేమ చిగురించినప్పుడే బ్రేకప్ లైసెన్స్ తీసుకుంటున్నారు. కారణం, ఒకరిపై ఒకరికి పూర్తిస్థాయిలో నమ్మకం లేకపోవడమే! వాట్సాప్‌లో ప్రేయసి ఆన్‌లైన్‌లో ఉన్నట్టు కనిపించిందా.. తనతో కాకుండా ఎవరితోనో చాట్ చేస్తుందన్న ఇతగాడి అనుమానం. అబ్బాయి వాట్సాప్‌లో లాస్ట్ సీన్ లేట్ నైట్ కనిపిస్తే ఆమెకు అనుమానం. మర్నాడు ఉదయం చర్చలు.. సాయంత్రానికి బ్రేకప్‌లు.. ఇదీ సంగతి! ఎవరి స్పేస్ వారికి ఇవ్వాలన్న చిన్న అవగాహన ఉంటే ఇలాంటి స్పై వ్యవహారాలకు తావుండదు. ఇంతకన్నా.. ప్రేమికులు ఒకరికొకరు ఇచ్చుకునే నమ్మకం మరేం ఉంటుంది.

తను ప్రేమించిన అమ్మాయి స్నాప్‌చాట్‌లో చలాకీగా ఉంటే అతనికి అసహనం. తనను ఆరాధించే అబ్బాయి కొలీగ్స్‌తో కాస్త క్లోజ్‌గా ఉంటే.. ఆమెకు చిరాకు. ఇద్దరి అభిప్రాయాలు, అభిరుచులు కలవనంత మాత్రాన ప్రేమించుకోవద్దనే రూల్ లేదు. ఒకరి అభిరుచులను, ఆసక్తులను మరొకరు గౌరవించుకుంటే.. అలాంటి ప్రేమ మరింత రసవత్తరంగా సాగుతుంది.

ఈ అనుమానాలు లేకుండా ఉండాలంటే.. ఒకరిపై ఒకరికి కొండంత నమ్మకం కుదరాలి. తన అభిప్రాయానికి విలువ ఇస్తానని మాటిచ్చి పుచ్చుకోండి. మాటిచ్చి మర్చిపోతానంటే కుదరదు.. దాన్ని నిలబెట్టుకున్నప్పుడే మీ పెండ్లి పుస్తకం ప్రేమకావ్యంగా నిలిచిపోతుంది. ఎందుకు ఆలస్యం చేతిలోన చెయ్యేసి 'ఐ లవ్యూ' అని నమ్మకంగా చెప్పేయండి!

ఓటీటీ హిట్

## అడుగడుగున గండం
### టియర్స్ ఆఫ్ ద సన్

నెట్‌ఫ్లిక్స్
**తారాగణం:** బ్రూస్ విల్లీస్, మోనికా బెలూచి, జానీ మెస్నెర్ తదితరులు
**దర్శకత్వం:** ఆంటోనీ ఫక్వా

బాక్సాఫీస్ దగ్గర ఎప్పుడో విడుదలైన సినిమాలు ఓటీటీలో మళ్లీ ప్రత్యక్షం కావడం ఇటీవల రివాజుగా మారింది. అలా ఓటీటీ ఎక్కిన చిత్రమే 'టియర్స్ ఆఫ్ ద సన్'. 2003లో వెండితెరపై విడుదలైన ఈ సినిమా అప్పట్లో సంచలనం సృష్టించింది. వసూళ్ల పరంగా పెద్దగా విజయం సాధించకపోయినా.. సినిమా సబ్జెక్ట్, టేకింగ్ విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ఈ చిత్రం రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది. కథలోకి వెళ్తే... నైజీరియాలో భీకర అంతర్యుద్ధం జరుగుతుంటుంది. జాతి, మత విద్వేషాలు పెచ్చరిల్లడంతో దేశమంతా హత్యాకాండ కొనసాగుతుంది. అధికారాన్ని హస్తగతం చేసుకున్న మిలటరీ దళాలు ఆ దేశ అధ్యక్షుణ్ని కూడా హతమార్చేస్తాయి. ఇలాంటి అరాచక పరిస్థితుల్లో ప్రజల మానప్రాణాలకు రక్షణ లేకుండా పోతుంది. నైజీరియాలో ఉన్న విదేశీయులపై కూడా సైన్యం దాడి చేస్తుంటుంది. అమెరికాకు చెందిన డాక్టర్ కెండ్రిక్స్ (మోనికా బెలూచి) నైజీరియాలో పేదలకు వైద్య సేవలు అందిస్తుంటుంది. దేశంలో అరాచకం తలెత్తిన నేపథ్యంలో ఆమెను అక్కడి నుంచి తప్పించాలని అమెరికన్ ఎంబసీ నుంచి ఆదేశాలు వస్తాయి. లెఫ్టినెంట్ వాటర్ (బ్రూస్ విల్లీస్) ఆధ్వర్యంలోని బృందం రహస్యంగా నైజీరియాలో దిగుతుంది. కెండ్రిక్స్ నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి చేరుకుంటుంది. ఆమెను తమ వెంట రావాల్సిందిగా వాటర్ కోరుతాడు. అక్కడున్న బాధితులను వదిలిపెట్టి తాను రాలేనంటుందామె. వాళ్లను కూడా కాపాడతామని మాటిస్తే గానీ.. కదలనంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో వాళ్లందరినీ కాపాడతానని వాటర్ మాటిస్తాడు. అందరినీ తీసుకొని అడవి దారిలో కామెరూన్ సరిహద్దులకు చేరుకోవాలని నిర్ణయిస్తాడు. ఈ దారిలో వాళ్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి, నైజీరియా సైనికుల నుంచి ఎలా తప్పించుకున్నారన్నది మిగిలిన కథ.



## రామాయణంలో రకుల్!

దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం'లో కీలక పాత్రకు రకుల్ ప్రీత్ సింగ్ ఎంపికైందని బీటౌన్ సమాచారం. రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ దేవోల్, లారా దత్త ఇప్పటికే ఈ చిత్రంలో భాగమైనట్టు వార్తలు వచ్చాయి. రాముడిగా రణ్‌బీర్, సీతగా సాయిపల్లవి నటిస్తున్నారు. రావణుడిగా యశ్‌ను ఫైనల్ చేశారు. సన్నీ దేవోల్ హనుమంతుడి పాత్ర పోషిస్తున్నారు. రావణుడి సోదరి శూర్పణఖ పాత్రకోసం రకుల్‌ను ఎంపిక చేశారని సమాచారం. రామాయణాన్ని మలుపు తిప్పిన కీలక పాత్ర కావడంతో, అభినయానికి అవకాశం ఉండటంతో నిడివి తక్కువైనా శూర్పణఖ క్యారెక్టర్‌కు ఆమె ఒప్పుకొందని టాక్. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది. మరోవైపు బాలీవుడ్ నటుడు, నిర్మాత జాకీ భగనానీతో రకుల్ వివాహం ఈ నెల 21న గోవాలో జరగనుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో ఆమెకు సంబంధించిన సన్నివేశాలు చిత్రించడానికి ప్లాన్ చేశారట దర్శకుడు నితీశ్.

